Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# పర్సనల్ లోన్

# అప్పుచేసి పప్పుకూడు వద్దు

మీకు పర్సనల్ లోన్ కావాలా అంటూ ఫోన్ల మీద అప్పులను జారీ చేసే రోజులివి. పర్సనల్ లోన్ అనే సరికి వెంటనే చేతికి అంది వచ్చేది, మన అవసరాలు ఎలాంటివైనా ఉపయోగపడేది. హౌజింగ్ లోన్, వాహన రుణాల మాదిరి కాకుండా దీనికి చాలా వెసులుబాటు ఉంది. అయితే అడగ్గానే చేతికంది వచ్చే ఈ పర్సనల్ రుణాలు మిగతా రుణాలతో పోల్చితే చాలా ఖరీదైనవి. ఎలాంటి తనఖాలు లేకుండానే వచ్చే ఈ రుణాలపై ఇతర రుణాలతో పోల్చితే వడ్డీ రేట్లు ఎక్కువ. అయితే పర్సనల్ లోన్ తీసుకునే ముందు కేవలం ఏ అవసరానికైనా వాడుకునే సౌలభ్యంతో పాటు ఇతర అంశాలను కూడా చాలా నిశితంగా పరిశీలించాలి. తీసుకునే ముందు ఏ అవసరం కోసం తీసుకుంటున్నామో స్పష్టత ఉంటే ఆ తర్వాత సమస్యలుండవు. అలాగే పర్సనల్ లోన్ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరిగినా మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. అయితే తీసుకునే ముందు పరిశీలించాల్సిన అంశాలను కొన్నింటిని ఇప్పుడు పరిశీలిద్దాం. అధిక వడ్డీతో పర్సనల్ లోన్ తీసుకుంటున్నాం కనుక దాన్ని విలువ కరిగిపోయే వాటిలో కాకుండా విలువ పెరుగుతూ ఉండే వాటిలో పెట్టుబడిపెట్టడం సముచితం. అంటే రుణంతో మనం కొనుగోలు చేసిన వస్తువు లేదా ఆస్తి విలువ పెరుగుతూ ఉంటే మనం చెల్లించే అధిక వడ్డీ కొన్ని రోజుల తర్వాత తీరిపోతుంది. ఎలాంటి సందర్భంలో దేని కోసం పర్సనల్ తీసుకుంటే ప్రయోజనం ఉంటుందో చూద్దాం.

## 1 ఇంటిని చక్కదిద్దడానికి

ఇంటిని చక్కదిద్దడానికి లేదా రినోవేషన్‌కు పర్సనల్‌లోన్‌ను వినియోగిస్తే దానికి ఆర్థిక పరమార్థం ఉంటుందని భావిస్తారు. ఇంటిని రినోవేషన్ చేయడం వల్ల ఇంటి విలువ పెరుగుతుందనకున్న సందర్భంలోనూ, అలాగే దాని కోసం సరిపడా నిధులు లేనప్పుడు పర్సనల్ తీసుకోడంలో తప్పు లేదు. అర్జంటుగా చేయాల్సిన రిపేర్ల వంటివాటిని పర్సనల్ లోన్ సహాయంలో చేపట్టవచ్చు. లేదా పర్సనల్‌లోన్‌పై అధికవడ్డీ ఉందనుకుంటే హోమ్ రినోవేషన్ లోన్‌ను హౌజింగ్‌లోన్‌కు టాప్ అప్ లోన్ తీసుకుంటే తక్కువ వడ్డీకే రుణం లభించవచ్చు. అయితే అలాంటి రుణాలు కొన్ని షరతులకు లోబడి జారీచేస్తారు. అంచనా వ్యయాన్ని పూర్తిగా పొందలేకపోవచ్చు కూడా. దానికి కోసం చాలా పేపర్ వర్క్ కూడా అవసరం ఉంటుంది. దాదాపుగా మళ్లీ హౌజింగ్ లోన్ తీసుకున్నంతగా కష్టపడాలి.

## 2 ప్రొఫెషనల్ కోర్స్ సర్టిఫికేషన్ కోసం

విలువను పెంచే మరో అంశం ఎడ్యుకేషనల్ లేదా ప్రొఫెషనల్ కోర్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ల కోసం పర్సనల్‌లోన్‌ను తీసుకోవచ్చు. దాని వల్ల కెరీర్ అవకాశాలు మెరుగుపడడానికి దోహద పడుతుంది. ప్రమోషన్లు రావడంలో ఉపయోగపడుతుంది. అందువల్ల పర్సనల్‌లోన్‌ను మీరు ప్రయోజనం ఆశించే తీసుకున్నట్టు అవుతుంది. ప్రమోషన్ కాకపోతే మరో మంచి ఉద్యోగం అధిక వేతనంతో లభించేందుకు దోహదపడుతుంది. తద్వారా పొందే ప్రయోజనాలు మనం పర్సనల్ లోన్ మీద చెల్లించే వడ్డీ భారం కాకుండా పోతుంది.



## 3 క్రెడిట్ కార్డు రుణాలను తీర్చడానికి

క్రెడిట్ కార్డుల మీద ఉన్న రుణాలను తీర్చివేయడానికి పర్సనల్‌లోన్ తీసుకోవడంలో ఔచిత్యం ఉంది. ఇందుకు మూడు కారణాలను మనం ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఒకటి, క్రెడిట్ కార్డుల మీద చెల్లించే వడ్డీ చాలా ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా సంవత్సరానికి సగటున 45 శాతం వరకు క్రెడిట్ కార్డు కంపెనీలు వడ్డీని చార్జీ చేస్తాయి. అయితే పర్సనల్ లోన్ కేవలం వార్షిక వడ్డీ 18 శాతానికే లభిస్తుంది. క్రెడిట్‌కర్డు రుణాన్ని పర్సనల్ లోన్ ద్వారా చెల్లించడం ద్వారా అధిక వడ్డీ చెల్లింపుల భారం నుంచి తప్పించుకోవచ్చు. రెండోది. అధిక వడ్డీ రుణాలను తీర్చి వేయడానికి పర్సనల్ లోన్ ఉపయోగించడం వల్ల కూడా క్రెడిట్ స్కోర్ పెరిగే అవకాశం ఉంటుంది. మూడోది, ఒకటి కన్నా ఎక్కువ క్రెడిట్ కార్డు బకాయిలను పర్సనల్ లోన్‌తో తీర్చి వేస్తే అనేక రుణాలు కాకుండా ఒకే ఒక రుణానికి నెలసరి వాయిదాలు చెల్లిస్తే అనేక తలనొప్పులు తగ్గుతాయి. అయితే ఇలాంటి ప్రయత్నానికి పూనుకుంటున్నప్పుడు వివిధ క్రెడిట్ కార్డుల మీద వడ్డీ రేట్లను పర్సనల్ లోన్ వడ్డీ రేట్లతో పోల్చి చూసుకోవడం మంచిది. రెండింటికి మధ్య చాలా భారీ వ్యత్యాసం ఉన్నప్పుడే పర్సనల్‌లోన్ తీసుకోవడం ఉత్తమ మార్గం అవుతుంది.

## 4 అత్యవసర పరిస్థితులు

మెడికల్, ఫ్యామిలీ అత్యవసర పరిస్థితుల కోసం లేదా ఉద్యోగం కోల్పోయినప్పుడు అప్పటికప్పుడు ఉత్పన్నమయ్యే అవసరాల కోసం పర్సనల్ లోన్‌ను తీసుకోవచ్చు. అసలు డబ్బులు లేక సతమతవుతున్న సందర్భంలో పర్సనల్‌లోన్ కాస్త ఊరటనిస్తుంది. అప్పటికప్పుడు ఉత్పన్నమయ్యే ఇలాంటి సందర్భాల్లో చాలా వరకు పర్సనల్‌లోన్‌తో సమస్యలు తీరిపోతాయి. కాస్త మర్యాద కూడా దక్కుతుంది. ఇలాంటి సందర్భాలకోసం ఎమర్జెన్సీ ఫండ్‌ను సమకూర్చుకోవడం, హెల్త్ ఇన్సూరెన్స్ ను తీసుకోవడం వంటి చర్యల వల్ల కొన్ని అత్యవసర పరిస్థితులను అధిగమించవచ్చు.

పర్సనల్‌లోన్ చాలా సులభంగా లభించేదే. రోజూ బ్యాంకుల నుంచి ఫైనాన్స్ కంపెనీల నుంచి పర్సనల్ లోన్ ఇస్తామంటూ ఫోన్ కాల్స్ వస్తూనే ఉంటాయి. తీసుకున్న రుణాన్ని దేని కోసమైనా వినియోగించుకునే సౌలభ్యం ఉన్న కారణంగా దుబారా కూడా జరిగే అవకాశం ఉంటుంది. ఎలాంటి సందర్భాల కోసం పర్సనల్ తీసుకోరాదో ఒకసారి చూద్దాం.

## 1 దినసరి ఖర్చులు

నిత్యావసర సరుకుల కోసం, ఇంటి అద్దె చెల్లించేందుకు వంటి రోజువారి ఖర్చులకు పర్సనల్ లోన్ తీసుకోవడం ఏమాత్రం సమంజసం కాదు. అలాంటి సందర్భాల్లో ఉన్నారంటే మీరు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నట్టు అర్థం. పర్సనల్‌లోన్‌లపై వడ్డీ ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. తిరిగి చెల్లించకపోతే లేదా ఒక్క ఈఎంఐ ఆలస్యం అయినా జరిమానాలు పడడంతో పాటు క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది. అన్నింటి కన్నా ముఖ్యంగా మీ ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతుంది. కనీసం ఆరు నెలలకు సరిపడా ఎమర్జెన్సీ ఫండ్‌ను ఎప్పుడూ దగ్గర ఉంచుకోండి. గడ్డుకాలంలో ఆ ఫండ్ ఉపయోగపడుతుంది.

## 2 లైఫ్ స్టైల్ ఖర్చులు

విహార యాత్రల కోసం, ఫర్నీచర్ కోసం లేదా గాడ్జెట్స్ కోసం పర్సనల్ లోన్ తీసుకోవడం సముచితమే అని చాలా మంది భావిస్తారు. కానీ అది తప్పు. విలాసాలకు, వినియోగానికి సంబంధించిన ఖర్చులన్నీ స్వంత సొమ్ముతోనే భరించడం మంచి మార్గం. వాటి కోసం మొదటినుంచి పొదుపు చేసి వాటిని పొందడం ఉత్తమ మార్గం అవుతుంది. ఈ విలాసాలను అప్పు చేసి తీర్చుకోవడం ఏ మాత్రం అనుసరించదగ్గ మార్గం కాదు. మీరు చేసిన విహార యాత్ర కొన్ని రోజుల్లో ముగుస్తుంది. కానీ దాని కోసం తీసుకున్న రుణం కొన్ని నెలల పాటు తీర్చాల్సి ఉంటుందన్న విషయాన్ని మర్చి పోవద్దు. కొన్ని నెలల తర్వాత విహార యాత్ర ఎందుకైనా వెళ్లామా అని చింతించాల్సి వస్తుంది. ఇలాంటి విలాసవంతమైన లైఫ్ స్టైల్ కోసం ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి. వాటిని వినియోగించుకునేందుకు సమయాన్ని నిర్దేశించుకుని దానికి తగ్గట్టుగా ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోండి. కచ్చితమైన లక్ష్యాలుంటే వాటి కోసం ముందు నుంచే పొదుపు చేయడం నేర్చుకోండి.

## 3 ఇన్వెస్ట్‌మెంట్ క్యాపిటల్

ఒకవేళ మీరు ఇన్వెస్ట్‌మెంట్ ప్రపంచానికి కొత్త అయితే పర్సనల్ లోన్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ క్యాపిటల్‌ను తీసుకోవడం గురించి పునరాలోచించండి. తక్కువ రిస్క్ ఉండే ఇన్వెస్ట్‌మెంట్ల మీద టాక్స్, ద్రవ్యోల్బణం అడ్జస్ట్ చేస్తే వచ్చే రాబడులు తక్కువగా ఉంటాయి. అవి మీ వడ్డీ చెల్లింపుల కన్నా తక్కువగా ఉంటాయి. మీరు చెల్లిస్తున్న వడ్డీ కన్నా ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే ఇన్వెస్ట్‌మెంట్లు ఉంటే వాటిలో రిస్క్ కూడా అధికంగానే ఉంటుంది. మీరు అనుభవం ఉన్న ఇన్వెస్టర్ అయితే, ఒడిదుడుకుల మార్కెట్లో స్టాక్స్ వంటి వాటి సాధనాల్లో మీరు మదుపు చేయగల నేర్పు ఉంటే మీరు తీసుకున్న లోన్‌తో ప్రయోజనాన్ని పొందవచ్చు. కానీ, అలాంటి రిస్క్‌తోకూడిన సాధానల్లో అప్పు చేసి మదుపు చేయడం సమంజసం కాదు.

**అదిల్ శెట్టి**
సీఈవో,బ్యాంక్ బజార్.కామ్

